## క్లుప్తంగా

### అభినందన



నెల్లూరు(బృందావనం): మిస్ సౌతిండియా, మిస్ ఆంధ్ర నవీనశెట్టికి అన్నమయ్య సర్కిల్ దగ్గర ఉన్న ఓ హోటల్‌లో ఆదివారం రాత్రి అభినందన కార్యక్రమం నిర్వహించారు. 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, సైకాలజిస్ట్ అభిషేక్ సింగంశెట్టి, వైఎస్సార్‌సీపీ స్టేట్ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ చీదెళ్ల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

### నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ

నెల్లూరు (టౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ-గ్రామీణ కౌసల్య యోజన పథకం ద్వారా సీడప్, ట్రెండ్జ్ ఐటీ ప్రైవేటు లిమిటెడ్ వారు కంప్యూటర్, వృత్తినైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ నిర్వాహకుడు సునీల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా సమయంలో భోజనం, వసతి, యూనిఫామ్‌లు ఉచితం అందజేయనున్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం ఇండస్ట్రియల్ సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగ అవకాశాన్ని కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 98661 11223 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### వ్యభిచార కేంద్రంపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఇళ్ల మధ్యలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతోన్న వ్యభిచార కేంద్రంపై దర్గామిట్ట పోలీసులు దాడులు చేశారు. నిర్వాహకులు పరారీలో ఉండగా విటుడిని పోలీసులు అరెస్ట్ చేసి, ఇద్దరు సెక్స్ వర్కర్లను హోమ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు నగరానికి చెందిన కల్యాణి, మురళి అనే ఇద్దరు పోస్టల్ కాలనీ మూడో వీధిలోని ఓ ఇంటిని రెండు నెలల కిందట అద్దెకు తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు చెందిన యువతులను తీసుకొచ్చి గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్నారు. దీనిపై సోమవారం దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ ఎం.రోశయ్యకు సమాచారం అందింది. ఆయన తన సిబ్బందితో ఇంటిపై దాడి చేశారు. విటుడు పొదలకూరు మండలానికి చెందిన మహేష్‌ను అరెస్ట్ చేసి ఇద్దరు సెక్స్‌వర్కర్లను అదుపులోకి తీసుకుని హోమ్‌కు తరలించారు. కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ పరారీలో ఉన్న ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

### కమిషనర్ పరిశీలన

నెల్లూరు(బారకాసు): 20వ డివిజన్ ఇస్కాన్ సిటీలో నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ పారిశుద్ధ్య పనులను సోమవారం పర్యవేక్షించారు. కాలువల్లో తప్పకుండా పూడికతీత పనులు చేపట్టి 24 గంటల్లో సిల్ట్ తొలగించాలని తెలిపారు. నూతన భవనాలను అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఖాళీ స్థలం పన్నులను పూర్తి స్థాయిలో చెల్లించి నిర్మాణాలు జరుపుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్పొరేటర్ చేజర్ల మహేష్‌బాబు, వివిధ విభాగాల అధికారులు ఉన్నారు.

### పోషకాహార ఆవశ్యకతపై అవగాహన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బోడిగాడితోట అర్బన్ హెల్త్ సెంటర్‌లో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ అరుణ పాల్గొని, పోషకాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నమ్మ, హెల్త్ సెంటర్ వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

### ప్రత్యేక వైద్య శిబిరం



నెల్లూరు(బారకాసు): నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 29వ డివిజన్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో స్వస్థ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఆ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ షేక్.సత్తార్ పాల్గొని, వైద్యసేవలపై ఆరాతీశారు. ఆయన వెంట స్థానిక నాయకుడు నిసార్ ఉన్నారు.

### పాఠశాలలో చేర్పించేలా చర్యలు



బాలుడితో మాట్లాడుతున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): ఓ బాలుడు యాచన చేస్తుండగా గమనించిన నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ స్థానిక వీఆర్ మున్సిపల్ హైస్కూల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక 20వ డివిజన్ ఇస్కాన్ సిటీ హనుమాన్ జంక్షన్ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులను సోమవారం పర్యవేక్షిస్తున్న సమయంలో బాలుడు యాచన చేస్తుండడం గమనించారు. ఆ బాలుడితో మాట్లాడి, కుటుంబ పరిస్థితిని తెలుసుకున్నారు. ఆ బాలుడిని పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలన్నారు.

# సమస్యలను పరిష్కరించండి మహాప్రభో

స్థానికంగా ప్రజా సమస్యలను పరిష్కరించడం లేదని ప్రజలు జిల్లా కేంద్రానికి పరుగులు పెడుతున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజలు పోటెత్తి సమస్యలపై అర్జీలు సమర్పించారు.

### రూ.2 లక్షల పరిహారమివ్వాలి



నెల్లూరు(అర్బన్): ఇటీవల సంతపేటలోని మున్సిపల్ మార్కెట్‌లో పాత దుస్తులు విక్రయించే దుకాణాలు విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా కాలిపోయాయని, తమకు రూ.2 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని స్థానిక వ్యాపారులు సులోచనమ్మ, విజయలక్ష్మి, లక్ష్మి, మురారికుమారి కోరారు. ఈ మేరకు వారు కలెక్టరేట్ వద్ద సీపీఎం నాయకులు కత్తి శ్రీనివాసులు, మూలం ప్రసాద్‌తో కలిసి నిరసన తెలిపారు. పండగల సమయం కావడంతో పెద్ద మొత్తంలో వడ్డీకి అప్పులు తెచ్చి సరుకును కొనుగోలు చేసి నిల్వ ఉంచామని, అంతా నష్టపోయామని, దుకాణాన్ని బట్టి రూ.50 వేలు, రూ.25 వేలు, రూ.10 వేలు నష్టపరిహారం ఇస్తామంటున్నారన్నారు. కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### కామాక్షితాయి ఆస్తులను కాపాడాలి



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న కామాక్షితాయి భక్తులు

నెల్లూరు(అర్బన్): బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడ గ్రామంలోని కామాక్షితాయి దేవస్థానానికి చెందిన ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ఆ దేవస్థానం చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, మాజీ చైర్మన్ రమేష్‌బాబు, వరదరాజస్వామి దేవస్థానం చైర్మన్ సాగర్ కోరారు. ఈ మేరకు పలువురు భక్తులతో కలిసి వారు కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపి కలెక్టర్ హిమాన్షు శుక్లాకు అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలోని సర్వే నంబర్ 91/16, 94, 129లలో అమ్మవారికి చెందిన 90 సెంట్ల మెట్టభూమి ఉండేదన్నారు. అక్కడ పూలు పండించి అమ్మవారి అలంకరణకు వినియోగించేవారన్నారు. తర్వాతి కాలంలో ఆ భూమిని లీజుకు ఇచ్చారన్నారు. అయితే వారు లీజు ఇవ్వకపోవడంతో కోర్టుకెళ్లగా కోర్టు లీజు చెల్లించడంతో పాటు భూమిని దేవస్థానానికి స్వాధీనం చేయాలని తీర్పు ఇచ్చిందన్నారు. అయితే శ్రీశైలం కృష్ణమూర్తి, సతీష్‌శర్మ, గిరిధర్‌లు ఆ భూమిని నెల్లూరులోని ఏటుకూరి మల్లీశ్వరికి అమ్మినట్టు నకిలీ పత్రాలు తెచ్చారన్నారు. ఇప్పుడు ఏకంగా ఆ భూమిని చదును చేసి ప్లాట్లు చేసి అమ్మేందుకు పూనుకున్నారన్నారు. రూ.5 కోట్ల విలువైన ఈ భూమిని కబ్జా చేశారంటూ పత్రికల్లో కథనాలు కూడా వచ్చాయన్నారు. దీనిపై బుచ్చిరెడ్డిపాళెం తహసీల్దార్‌కు తెలిపినప్పటికీ ఆయన పట్టించుకోవడం లేదని, కలెక్టర్ జోక్యం చేసుకుని అమ్మవారి ఆస్తులను కాపాడాలన్నారు కలెక్టర్ సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, శివకుమార్, లక్ష్మయ్య, బాలకృష్ణ, నవీన్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

### బాక్స్‌టైప్ బ్రిడ్జి నిర్మించాలంటూ ఆందోళన

నెల్లూరు(అర్బన్): కొండాయపాళెం రైల్వేగేటు వద్ద బాక్స్‌టైపు బ్రిడ్జి నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరుతూ సీపీఎం 20, 21వ డివిజన్ నేతల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నగరంలోని కొండాయపాళెం రైల్వేగేటుకు తూర్పు ప్రాంతం వేగంగా విస్తరిస్తోందన్నారు. ఇక్కడ రద్దీని దృష్టిలో ఉంచుకుని మొదట అక్కడ ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని అనుకున్నప్పటికీ ఆచరణలో సాధ్యం కాదని విరమించుకున్నారన్నారు. ఇప్పుడు అండర్ పాస్ నిర్మించాలనే ఆలోచన ఉందన్నారు. ఇదే జరిగితే దశాబ్దాల తరబడి ఉన్న వందలాది ఇళ్లను కూల్చి వేయాల్సి వస్తోందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వానికి పెద్దగా భారం లేని, స్థానికులకు నష్టం జరగకుండా ఉండేందుకు రైల్వే బాక్స్‌టైపు బ్రిడ్జిని నిర్మించాలని కోరారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

ఈ మేరకు సీపీఎం నాయకులు ప్రజల నుంచి సేకరించిన సంతకాల పత్రాలను కలెక్టర్‌కు అందజేశారు. అంతకు ముందు వారు వనంతోపు సెంటర్ నుంచి కొండాయపాళెం రైల్వే గేటు వరకు ప్రదర్శన నిర్వహించారు. రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, కమిటీ సభ్యులు పోతురాజు శ్రీనివాసులు, నాగేశ్వరరావు, కార్యదర్శులు రమణయ్య, రత్నం, అల్లూరు శ్రీనివాసులు, డీమార్ట్ ఆటో స్టాండ్ అధ్యక్ష, కార్యదర్శులు మణి,ముని పాల్గొన్నారు.

### మౌలిక వసతుల కోసం..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మౌలిక వసతులు కల్పించాలని 53వ డివిజన్ వెంకటేశ్వరపురం సచివాలయం వద్ద ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో మహిళలు సోమవారం ధర్నా నిర్వహించి సచివాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా నగర కార్యదర్శి కత్తి పద్మ, 53వ డివిజన్ నాయకులు మహ్మదా మాట్లాడుతూ కుళాయిల్లో వస్తున్న నీరు కలుషితంగా ఉన్నాయని, పారిశుద్ధ్యం, డ్రెయినేజీ వ్యవస్థలు సక్రమంగా లేకపోవడంతో దోమల సమస్యల తీవ్రంగా ఉందన్నారు. ఇలాంటి చిన్న సమస్యలను కూడా పరిష్కరించలేని పరిస్థితుల్లో అధికార యంత్రాంగం ఉందని, ఈ విషయమై పలుమార్లు సచివాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా



సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న ఐద్వా నాయకులు

ఫలితం లేకుండాపోతోందని వాపోయారు. స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఐద్వా నాయకులు భార్గవి, లక్ష్మి, షాహిన్, రాజేశ్వరి, షబ్బీర, సుశీలమ్మ, ధనమ్మ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

నెల్లూరు (టౌన్): కొత్త ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని అపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ తెలిపారు. డీఎస్సీ ద్వారా నియమితులైన కొత్త ఉపాధ్యాయులకు స్థానిక ఐఎంఏ హాల్లో సోమవారం అభినందన సభ నిర్వహించారు. అపస్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాలచార్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై అపస్ పోరాడుతుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, రాష్ట్ర సహాధ్యక్షుడు చక్రపాణి, నాయకులు రామకృష్ణ, రమేష్‌బాబు, చంద్రమౌళి, మణికంఠఆచారి, రాజేశ్వరరావు, వాసు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న బాలాజీ

## ఓటు చోరీపై సంతకాల సేకరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఓటు చోరీపై కాంగ్రెస్ పార్టీ నగరాధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 53, 54 డివిజన్లలో సోమవారం సంతకాల సేకరణ నిర్వహించారు. నగర ఉపాధ్యక్షుడు సంజయ్‌కుమార్, జనరల్ సెక్రటరీ సుధీర్, డివిజన్ ఇన్‌చార్జి ప్రసాద్ పాల్గొన్నారు.

## యోగాలో గోల్డ్ మెడల్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర యోగా పోటీల్లో కోవూరుకు చెందిన ప్రసూనకు సోమవారం గోల్డ్ మెడల్ లభించింది. విజయవాడలో జరుగుతున్న యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో మహిళా విభాగంలో సీనియర్ కేటగిరీలో జిల్లాకు చెందిన ప్రసూన అవార్డు సాధించడంపై జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ పెంచలయ్య, ఉపాధ్యక్షుడు ఎం.రవీంద్ర, కార్యదర్శి జ్యోతి రాజేంద్రకుమార్, కోచ్ మానస, కమిటీ సభ్యులు పద్మావతి, కావ్య అభినందనలు తెలిపారు.



## గుండె వ్యాధులపై అవగాహన అవసరం

నెల్లూరు(అర్బన్): గుండె వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా గుండెపోటును నివారించవచ్చని కిమ్స్ ఆస్పత్రి కార్డియాలజిస్టులు డాక్టర్ శ్రీనివాసరాజు, డాక్టర్ సాహెబ్‌పీరా తెలిపారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కిమ్స్ ఆస్పత్రి డాక్టర్లు, వైద్య సిబ్బంది దర్గామిట్టలోని ఆస్పత్రి నుంచి 3కే రన్‌ను ట్రంకు రోడ్డులో నిర్వహించారు. హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ సమతుల్య ఆహారం తీసుకోవడం, తగిన వ్యాయామం, ఒత్తిడి తగ్గించుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగరాజరావు, కార్డియోథొరాసిక్ సర్జన్ లోకేష్, జనరల్ సర్జన్ జగదీష్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



## వాస్కులర్ సేవలు ఎంతో అవసరం

నెల్లూరు(అర్బన్): మహా నగరాలకే పరిమితమైన వాస్కులర్, ఎండో వాస్కులర్ సేవలు నెల్లూరులో ప్రారంభించడం ఎంతో అవసరమని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి అన్నారు. నగరంలోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తిస్థాయి వాస్కులర్, ఎండో వాస్కులర్ సేవలందించే విభాగాన్ని సోమవారం ప్రారంభించారు. షుగర్, కిడ్నీ వ్యాధులు ఎక్కువవుతున్న నేటి తరుణంలో ఈ విభాగానికి చెందిన సేవలు చాలా అవసరమన్నారు. వాస్కులర్ సర్జన్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రక్తప్రసరణ సమస్యల వల్ల ప్రధానంగా ఎంతో మంది షుగర్ పేషెంట్లకు కాలు తీసేయడం, వేళ్ల తొలగించడం లాంటివి జరుగుతున్నాయన్నారు. వాస్కులర్ సేవలు అందుబాటులో ఉంటే అలా తొలగించకుండా అవయవాలను కాపాడుకోవచ్చన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. డాక్టర్ వాకమూడి ప్రకాష్, డాక్టర్ చంద్రశేఖర్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రరెడ్డి, రాహుల్‌బాబు, మెడికవర్ సెంటర్ హెడ్ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.



మెడికవర్‌లో వాస్కులర్, ఎండో వాస్కులర్ విభాగాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

## ఆవాస్ యోజనను సద్వినియోగం చేసుకోండి


నెల్లూరు(బారకాసు): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం ద్వారా సొంత స్థలం కలిగిన వారికి ప్రభుత్వం రూ.2.5 లక్షల ఆర్థిక సాయం అందించి గృహ నిర్మాణాలకు తోడ్పడుతుందని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎన్‌ఎంసీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం నిర్వహించారు. కమిషనర్ నందన్ పాల్గొని, అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడ్కో గృహ సముదాయాల్లో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేసి త్వరలో ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎన్టీఆర్ కాలనీలో నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం నుంచి బీసీ వర్గాలకు రూ.50 వేలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు రూ.75 వేలు అదనంగా అందించి ఇళ్ల నిర్మాణాలకు తోడ్పడుతోందన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ పథకం ఆవశ్యకతను తెలియజేయాలన్నారు. దీనిని రియల్ ఎస్టేట్ డెవలపర్స్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 49 వినతులు స్వీకరించినట్లు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, సిటీ ప్లానర్ హిమబిందు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, మేనేజర్ రాజేశ్వరి వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ నందన్

## ఘనంగా 'హార్ట్ డే'

నెల్లూరు(అర్బన్): నగరంలోని నారాయణ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రపంచ హార్ట్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. నారాయణ వైద్యవిద్యా సంస్థల డీన్ డాక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్-డివైస్ స్పెషలిస్ట్ డాక్టర్ రామ్‌కుమార్ పాల్గొని, కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ గుండె ప్రాముఖ్యతను తెలుసుకునేందుకు వరల్డ్ హార్ట్ డేను నిర్వహిస్తామని తెలిపారు. గుండెకు సంబంధించిన వ్యాధులు రాకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జీవనశైలిని మార్చుకుని, కనీసం ఏడు గంటల పాటు నిద్రపోవాలన్నారు. జంక్‌ఫుడ్స్ ఆపాలన్నారు. నడక, యోగాలాంటివి తప్పనిసరిగా చేయాలన్నారు. తద్వారా గుండె జబ్బులను నివారించవచ్చన్నారు. గుండె పనితీరు తక్కువగా ఉన్న వారు నారాయణ కార్డియాలజీ విభాగంలోని ఎలక్ట్రో ఫిజియాలజీ సేవలను వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కార్డియాక్ ఐసీయూ వైద్యుడు డాక్టర్ భరత్, ఏజీఎం ఏసీ శేఖర్‌రెడ్డి, కార్డియాలజీ బృందం పాల్గొన్నారు.



# సరస్వతీ.. నమస్తుభ్యం

నెల్లూరు(బృందావనం): నగరంలో శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎనిమిదో రోజు సోమవారం మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు.

⇨ రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. దేవస్థానం ప్రాంగణంలోని మీనాక్షీసుందరేశ్వరస్వామి ఆలయంలో లలితా కుంకుమార్చన, మహన్యాసం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల ఉభయకర్తలుగా బండారు మధుసూదన్‌రెడ్డి- రజని, ఏలూరు శివనారాయణ- శిరీష, అమ్మనబ్రోలు శ్రీధర్‌రెడ్డి- శ్రీకళ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ ఏలూరు శిరీష, సభ్యులు పర్యవేక్షించారు.

⇨ స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. మూలవర్లను పుస్తకాలు, పెన్నులతో అలంకరించారు. ఉభయకర్తలుగా మునగా వెంకటేశ్వర్లు- వెంకటలక్ష్మీకుమారి దంపతులు, కుటుంబసభ్యులు వ్యవహరించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, నిచ్చెనమెట్ల చిరంజీవి, ఉమ్మెన జనార్దన్, ఆంజనేయులు, వేముల ప్రసాద్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

⇨ మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా జి.నరసింహప్రసాద్- మైథిలి, కె.విజయభాస్కర్‌రెడ్డి- అరవింద, డి.శ్రీహరి- వెంకటసుదర్శనమ్మ కుటుంబసభ్యులు వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

⇨ సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు చండీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కె.కిరణ్‌కుమార్, లలితారాణి, ఎల్.విజయకుమార్, బి.మధుసూదన్‌రెడ్డి, రజని వ్యవహరించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఒట్టూరు సురేంద్రయాదవ్, ఈఓ వి.గిరికృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

⇨ సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తగా గాదిరాజు శాంతమ్మ వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తలు బాలాజీసింగ్, జీసీ ధరమ్‌సింగ్, ఈఓ బి.మల్లికార్జునరెడ్డి, ప్రధానార్చకుడు ఆర్.శ్రీనివాసులు శర్మ పర్యవేక్షించారు..

⇨ ఏసీ నగర్ కోదండరామపురం మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా మేడేపల్లి వంశీకృష్ణ- సాయిమణిహారిక, సూరిశెట్టి వెంకటప్రసాద్‌రావు- మాధవిలత, వాకా శ్రీనివాసులురెడ్డి- రమాదేవి, దగ్గుమాటి శ్రీధర్‌రావు- అనూష దంపతులు వ్యవహరించారు. దేవస్థానం కమిటీ చైర్మన్ పత్తి నరసింహం, సభ్యులు పర్యవేక్షించారు.

⇨ మెక్లిన్స్‌రోడ్డు విరాట్ నగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఎస్.వెంకటసత్యనారాయణ- సుభాషిణి, ఎం.ద్వారకానాథ్- సాయికుమారి, ఆర్.చంద్రఆచారి- శైలజ, బి.శ్రీధర్‌ఆచారి- భరణి, ఎం.బ్రహ్మానందరెడ్డి- నాగశాంతి దంపతులు వ్యవహరించారు.

⇨ బాలాజీ నగర్‌లోని సీతారామస్వామి మందిరంలో అమ్మవారు మహా సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. ధనలక్ష్మి హోమం, కుంకుమ పూజలు చేశారు. ఉభయకర్తలుగా కె.ప్రవీణ్‌శంకర్- శిరీష దంపతులు కుటుంబసభ్యులు వ్యవహరించారు.

⇨ నవాబుపేటలోని శ్రీకృష్ణ ధర్మరాజస్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కంచి అరవింద్- విజయ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను సాదా నాగేంద్రకుమార్, కంచి జ్ఞానేంద్ర, దేవస్థానం కార్యనిర్వహణాధికారి జీసీహెచ్ దర్గయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

⇨ మూలాపేటలోని శ్రీకృష్ణ ధర్మరాజస్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా డాక్టర్ ఆర్.రఘురాజ సింహ- హిమజ దంపతులు వ్యవహరించారు.

⇨ నవాబుపేట పరుచూరివారి వీధి మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. నవావరణ పూజ నిర్వహించారు. ఉభయకర్తలుగా పంచాగ్నుల పవన్‌కుమార్ సోదరులు వ్యవహరించారు. నిర్వాహకులు గాదంశెట్టి గోపాల్- శ్యామల దంపతులు, అర్చకుడు పారా శ్రీధర్‌శర్మ పర్యవేక్షించారు.

⇨ మూలాపేట శంకరమఠం ప్రాంగణంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు మహా సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. చండీ హోమం నిర్వహించారు. కొప్రపాటి నందకిశోర్- ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

⇨ నెల్లూరు(వీఆర్సీసెంటర్): దసరా ఉత్సవాల్లో భాగంగా వెంకటేశ్వరపురంలో కొలువైన వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్వామివారి వద్ద ఉంచిన నోట్ పుస్తకాలు, పెన్నులను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమాలకు అలహరి ప్రతాప్‌కుమార్- చేతన దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అర్చకుడు సాయి భరద్వాజ, చైర్మన్ నాగిరెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



కోదండరామపురం మహాలక్ష్మి దేవస్థానంలో..



కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



నవాబుపేట ధర్మరాజస్వామి దేవస్థానంలో..



నవాబుపేట మహాలక్ష్మి ఆలయంలో..



గురువాయూర్ మహాలక్ష్మి ఆలయంలో..



మెక్లిన్స్‌రోడ్డు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో..



బాలాజీనగర్ సీతారామస్వామి మందిరంలో..



వెంకటేశ్వరపురంలో..